ఆంధ్రా క్రికెట్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా సుజయ్‌కృష్ణ

ప్రజాశక్తి-బొబ్బిలి

సోమవారం జరిగిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. త్వరలో జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్- 2025 నిర్వహణ బాధ్యతలను చైర్మన్ హోదాలో సుజయ్ కృష్ణ రంగారావు చేపట్టనున్నారు. 2025 ఆంధ్రా ప్రీమియర్ లీగ్ చైర్మన్‌గా ఎన్నికైన రంగారావుకు క్రికెట్ సంఘాలు అభిమానులు అభినందనలు తెలిపారు. త్వరలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహణ పై రంగారావు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా ప్రీమియర్ లీగ్ తేదీ ఖరారు. ప్రాంఛైజీలు వంటి అంశాలు చర్చకు రానున్నాయి.

వ్యవసాయశాఖకు అవినీతి తెగులు సోకింది. కొందరు అధికారులు జలగల్లా తయారై వ్యవసాయశాఖ నిధులను గోల్‌మాల్ చేస్తున్నారు. ఈ అవినీతి రూ.లక్షల్లో సాగుతోందంటే.. నిధుల స్వాహా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సబ్ డివిజన్ స్థాయి అధికారుల అక్రమార్జనలో అదే శాఖ మండల స్థాయి అధికారులు వాటాలు కూడా ఉంటున్నాయని సిబ్బంది చెబుతున్నారు. వీరి అక్రమార్జనకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది బలవుతున్నారు.



In this regard, Markfed proposing to give Incentives to the Village Agricultural Assistants & Gram/Ward Volunteers on the sale of fertilizers made at the RBKs as follows:

Urea	Rs.50/MT (Rupees Fifty only per MT)
DAP, NPKs & Others	Rs.100/MT (Rupees One hundred only per MT)

ఎరువుల విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహకాల సర్క్యులర్



న. ఆర్. యస్. కె మెయింటెనెన్స్ కొరకు 2024-25 వార్షిక సంవత్సరం లో ప్రభుత్వం రూ.26.48 కోట్లు నిధులను మంజూరు చేయగా, ఆ నిధులను ఎటువంటి బకాయిలు లేకుండా ఆర్. యస్. కె మెయింటెనెన్స్ కొరకు ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులకు విడుదల చేయగా, ఆ నిధులను ప్రతి నెల రూ.2047/- చొప్పున ఆర్. యస్. కె మెయింటెనెన్స్ కొరకు వినియోగించుకొనుచున్నారని సమర్పించడమైనది.

PIO/ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్,
(ఆర్.యస్..కె-1)

ఆర్ఎస్‌కెల నిర్వహణకు నెలకు రూ.2047 చొప్పున ప్రభుత్వం ఇస్తున్నట్లు విడుదల చేసిన కాపీ

వ్యవసాయ శాఖకు అవినీతి తెగులు

- లక్షల్లో నిధులు కాజేసిన వైనం
- అడిగిన సిబ్బందిపై వేధింపులు, తిట్ల దండకాలు

బాడంగి వ్యవసాయ శాఖ కార్యాలయం

ప్రజాశక్తి-బాడంగి

వ్యవసాయశాఖ బొబ్బిలి సబ్‌డివిజన్ పరిధిలో 76 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు గత నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులేవీ చేరడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను వ్యవసాయశాఖ జిల్లా అధికారులు సబ్‌డివిజన్‌కు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి కింది స్థాయికు నిధులు వెళ్లడం లేదు. చెక్‌పవర్ కలిగిన వ్యవసాయ శాఖ ఎడి నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సబ్‌డివిజన్ పరిధిలోని ఎఒలు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ఎస్‌కె సిబ్బంది ఎవరైనా నిధులు రాలేదని అడిగితే, మూకుమ్మడిగా దాడి చేస్తూ, వేధింపులకు దిగుతున్నట్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

ఉద్యోగులపై నిర్వహణ భారం

రైతు సేవా కేంద్రాల నిర్వహణ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు అమలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. అందుకే సిబ్బందిపై భారం లేకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఆర్ఎస్‌కె నిర్వహణకే నెలకు రూ.2047 చొప్పున అందిస్తోంది. మిగతా కార్యక్రమాలకూ నిధులిస్తోంది. వాటిని ఎడి, ఎఒలు కలిసి విడుదల చేయకపోవడంతో ఆ భారం ఆర్ఎస్‌కె సిబ్బందిపై పడుతోంది. సొంత డబ్బులతోనే ఆర్ఎస్‌కెల నిర్వహణ చూసుకుంటున్నామని వారంతా ఆవేదన చెందుతున్నారు. పొలంబడి కార్యక్రమ నిర్వహణ భారమూ వారిపైనే పడుతోంది. ఈ కార్యక్రమం అమలుకు ప్రభుత్వం రూ.20,514 ఇవ్వడం గమనార్హం. ప్రభుత్వం చేపడుతున్న మిగతా కార్యక్రమా లకు సైతం ఎడి, ఎఒలు నిధులు ఇవ్వకపోవడంతో, సొంత డబ్బులతోనే ఆర్ఎస్‌కె సిబ్బంది చేపడుతూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

నోరుమెదపని సిబ్బంది

సుమారు నాలుగేళ్ల నుంచి ఆర్ఎస్‌కెలకు నిధులు విదల్చక పోవడంతో అక్కడి సిబ్బంది సొంత డబ్బులతో నెట్టుకొస్తున్నారు తప్ప ఎవరూ నోరు విప్పడం లేదు. అందుకు కారణం లేకపోలేదు. ఎవరైనా నిధుల గురించి బాడంగి ఎఒ, లేదా బొబ్బిలి ఎడిని అడిగితే వేధింపులకు దిగుతున్నారని, అందరి ముందూ, వాట్సాప్ గ్రూపుల్లో తిట్ల దండకం అందుకుంటున్నారని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కాలంలో ఓ ఉద్యోగి.. నిర్వహణ భారమవుతోందని ఎఒ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కాస్తా ఎఒ.. ఎడికి చేరవేయడంతో ఆ ఉద్యోగిని అందరి ముందూ అవమానానికి గురిచేశారు. దీంతో తోటి సిబ్బంది వద్ద ఆ ఉద్యోగి కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది. కార్యాలయ పనివేళలు ముగిసినా ఒత్తిడి చేస్తూ, మనోవేదనకు గురి చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. దీంతో సబ్‌డివిజన్ పరిధిలోని ఆర్ఎస్‌కె సిబ్బంది అవమానాలు భరిస్తూ నోరు మెదిపేందుకు భయపడుతున్నారు.

లక్షల రూపాయలు పక్కదారి

బొబ్బిలి సబ్‌డివిజన్ పరిధిలోని 76 రైతు సేవా కేంద్రాలకు నిర్వహణ కోసం గతేడాది రూ.18.66 లక్షలు విడుదలయ్యాయి. నాలుగేళ్లలో రూ.74 లక్షలు పైమాటే. నిర్వహణ నిధులొక్కటే కాదు.. పొలంబడి, పంటకోత ప్రయోగాలు, మట్టి నమూనాలు సేకరణ నిధులు, ధాన్యం కొనుగోలు, ఎరువుల విక్రయాల ప్రోత్సాహకాల నిధులు ప్రభుత్వం రూ.లక్షల్లో విడుదల చేసింది. జిల్లాలో కేవలం మట్టి నమూనాలు సేకరించినందుకు రూ.10 లక్షలకు పైగా ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లెక్కన సబ్‌డివిజన్ పరిధిలో నాలుగేళ్ల నుంచి లక్షల రూపాయలు నిధులు దారిమళ్లినట్లు స్పష్టమవుతోంది. వ్యవసాయ శాఖ ఎడి, సబ్‌డివిజన్ పరిధిలోని ఎఒలు కలిసి, ఈ నిధులను కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఇదే తరహాలో వ్యవసాయ శాఖ నిధుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

ఆర్ఎస్‌కెల నిర్వహణకు నిధులు రావు

రైతు సేవా కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి నిధులు విడుదల చేయడం లేదు. రైతు సేవా కేంద్రాలు శుభ్రం చేస్తున్న స్వీపర్లకు నెలకు డివిజన్‌కు రూ.4వేలు నుంచి రూ 5వేలు వరకు విడుదల చేస్తే ఒకొక్క రైతు సేవా కేంద్రానికి రూ.100 కూడా రాదు. ప్రభుత్వం ఇస్తున్న నిధులను ఒకొక్క కేంద్రానికి మూడు నెలలకు ఒకసారి రూ.500 వరకు ఇస్తున్నాం. ఇంటర్నెట్, విద్యుత్ బిల్లులు ప్రభుత్వం నేరుగా ఆయా ఖాతాలకు జమ చేస్తుంది. వ్యవసాయ సహాయకులు సక్రమంగా విధులు నిర్వహించకపోతే మందలించడంతో నాపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారు.

- ఎం. శ్యామసుందర్, వ్యవసాయ శాఖ ఎడి, బొబ్బిలి

ప్రతి అర్జీకీ పరిష్కారం

పిజిఆర్ఎస్‌లో వినతులను స్వీకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గ్రీవెన్స్‌లో వినతులను స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక-పిజిఆర్ఎస్ లో పాల్గొని మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ సక్రమమైన పాలననందించాలనే ఉద్దేశంతోనే ప్రజా ప్రతినిధులు కూడా పిజిఆర్ఎస్‌లో పాల్గొని వినతులను పరిశీలించాలని, పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగానే పిజిఆర్ఎస్ లో పాల్గొంటున్నామని, ప్రతి అర్జీకి సరైన పరిష్కారం చూపించి, అర్జీ దారు సంతృప్తి చెందేలా రెడ్రెస్సల్ చేయడం జరుగుతోందని అన్నారు. ప్రతి నెలా వినతులపై ముఖ్య మంత్రి సమీక్షిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గతంలో ఎక్కువగా రెవిన్యూ సమస్యలే వచ్చేవని, రెవిన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరించడంతో ఆ వినతులు కొంత మేరకు తగ్గాయని తెలిపారు. వ్యవసాయ, సాగునీరు, గ్రామ స్థాయి సమస్యలు ప్రస్తుతం ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు.

వినతులలో ముఖ్యమైనవి

- బాడంగి మండలం గొల్లాది గ్రామస్తులు తమ గ్రామం లో గల చెరువులకు వేగావతి నది నుండి ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేయాలనీ కోరుతూ మంత్రి కి వినతి పత్రాన్ని సమర్పించారు.
- బొండపల్లి మండల గిట్టుపల్లి రెవిన్యూ పరిధి లో భూమి లో హెచ్‌పిసిఎల్ వారు విశాఖపట్నం టు రాయిపూర్ పైప్ లైన్ల కోసం నోటీసులు ఇచ్చారని, భూమి సుమారుగా 90 లక్షల వరకు విలువ ఉందని, పరిహారం పంపిణీలో న్యాయం చేయాలని కోరారు.
- వైద్య శాఖ ఉద్యోగ నియామకాల గురించి , ఈనాం భూముల గురించి, భవన అనుమతులు , వ్యక్తిగతమైన రెవిన్యూ అంశాలపై పలువురు వినతులు అందజేశారు.
- గిరిజన విద్యార్థులు, వసతి గృహ సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పి.సురేష్ కోరారు. విజయనగరం మహారాణి పేట లో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని తొలగించే ఆలోచన ఉందని, వెంటనే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 187 వినతులు

సోమవారం పిజిఆర్ఎస్ కు 187 వినతులు అందాయి. మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళీ , ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 187అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 88 వినతులు ఉన్నాయి.

గ్రేహౌండ్స్‌కు భూములిచ్చేది లేదు

అప్పన్నదొర వలస గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ గ్రామంలో పోలీస్ గ్రే గ్రౌండ్స్ ఏర్పాటుకు తాము భూములిచినట్లు ఆర్‌డిఒ చేసిన తప్పుడు తీర్మానాన్ని రద్దు చేయాలని, తరతరాలుగా ఆ భూములు సాగుజేస్తున్న తమకు పట్టాలివ్వాలని ట్రైబల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద అప్పన్నదొరవలస గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షులు అర్.లోవరాజు మాట్లాడుతూ కొత్తవలస మండలం అప్పన్నదొర వలస గ్రామ గిరిజనులు సాగు చేసుకొని జీవిస్తున్న భూములను గ్రామ ప్రజలు ఆమోదం లేకుండా పోలీస్ గ్రే గ్రౌండ్స్‌కు భూములిస్తున్నట్లు తప్పుడు తీర్మానం చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. అనేక తరాల నుంచి ఆ భూములు సాగు జేసుకొని జీవిస్తుంటే కేవలం పదేళ్ల నుంచి అక్కడ ఉన్నట్లు తప్పుడు సమాచారం నమోదు చేసి అధికారులు ఇవ్వడం తగదన్నారు. వెంటనే తీర్మానాన్ని రద్దు చేసి,గిరిజనులకు భూమి పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ధర్నాలో గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిగా బబిత

గుంటూరుకు సాయి కళ్యాణ చక్రవర్తి బదిలీ

ఎం.బబిత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఎం.బబిత నియమితులయ్యారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న బబితను జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ జిల్లా జడ్జిగా పనిచేస్తున్న బి.సాయి కళ్యాణ చక్రవర్తి బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తికావడంతో గుంటూరు జిల్లా జడ్జిగా ఆయన్ను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జిపిగా సూర్యనారాయణ

జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా ఆర్.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ జిపిగా పనిచేసిన శ్రీనివాసరావు పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో సూర్యనారాయణ నియమితులయ్యారు. ఆయన ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం, జిపిగా బాధ్యతలను స్వీకరించారు. ఆయన జిపిగా మూడు సంవత్సరాలపాటు సేవలు అందించనున్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో

గ్రోత్ రేట్ పెరగాలి : కలెక్టర్

విజయనగరం : వ్యవసాయ అనుబంధ రంగాల్లో 12.97 శాతం ఉన్న వృద్ధి రేట్ను ఈ ఏడాది లో 16.32 శాతానికి పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచడానికి వ్యవసాయం లో ఎటువంటి చర్యలు చేపట్టాలో వ్యవసాయాధికారులు మండల వారీగా కార్యాచరణ ప్రణాళిక ను రూపొందించి పంపాలన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వ్యవసాయ అనుబంధ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా వరి పండుతుందని, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏ మండలంలో ఏయే పంటలకు అవకాశం ఉందో గుర్తించి మండల వ్యవసాయాధికారులు మండల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఈ నెల 15 లోగా సమర్పించాలని అన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం 25 వేల ఎకరాల్లో సాగు అవుతోందని, ఈ విస్తీర్ణాన్ని కూడా పెంచాలని తెలిపారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, వ్యవసాయ శాఖ జెడి తారక రామారావు, డిడిలు, ఎడిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు రికార్డును పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు

జాతీయ స్థాయికి నేచురల్ హెయిర్ డై ప్రాజెక్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ సెల్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అటల్ టింకరింగ్ లాబ్, నీతి అయోగ్ తో సంయుక్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ పోటీల్లో రేగిడి ఉన్నత పాఠశాల విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయిని బూరవెల్లి ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో సృజనాత్మకంగా రూపొందించిన నేచురల్ హెయిర్ డై అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. టాప్ 100 ప్రాజెక్టులలో చోటు దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు లక్ష ప్రాజెక్టులు ఎంపిక కాగా వాటిలో ఫైనల్స్ లో 100 ప్రాజెక్టులను సెలెక్ట్ చేశారు. ఈ ప్రాజెక్ట్ మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం మొదటి విడత ముప్పై వేల రూపాయలు నిధులు విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ను జూలై 29న న్యూ ఢిల్లీలో ప్రదర్శించ నున్నారు.దేశం లోని వివిధ పాఠశాలలో పై కార్యక్రమం ద్వారా (సమాజం లోని సమస్యలకు పరిష్కరించే విధంగా ఉన్న) 1000 టాప్ బెస్ట్ ఐడియాలను స్వీకరించి అందులో 100 ఉత్తమ ఆలోచనలకు 1 లక్ష నుండి 1.5 లక్షల వరకు నిధులు సమకూర్చి, పేటెంట్ రావడానికి, ఎంటర్ప్రెన్యూర్స్ గా తయారు చెయ్యడానికి సహకరిస్తారు. ఈ ప్రాజెక్ట్ తయారుచేసిన ఉపాధ్యాయినిని, విద్యార్థులను డిఇఒ యు.మాణిక్యం నాయుడు అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి రాజేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ సన్యాసినాయుడు, ఎంజిసి కో ఆర్డినేటర్ బి.వేణుగోలరావు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ డిజైన్‌పై

గ్రామసభల తీర్మానాల మాటేమిటి?

నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్

నినాదాలు చేస్తున్న నిర్వాసితుల పోరాట కమిటీ సభ్యులు, రైతులు

ప్రజాశక్తి-వేపాడ

పోలవరం ఎడమ కాలువ డిజైన్‌పై గతంలో నిర్వహించిన గ్రామసభల తీర్మానాలను ఏం చేశారని నిర్వాసితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం పోలవరం ఎడమ కాలువ నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యాన నిర్వాసితులతో కొండగుళ్ల వద్ద సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం డిజైన్ వల్ల వేలాది మంది రైతులు నష్టపోయి నిరాశ్రయులు అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల డిమాండ్ మేరకు కలెక్టర్ గ్రామసభలు నిర్వహిస్తే, అన్ని గ్రామసభల్లోనూ అడ్డదిడ్డంగా ఉన్న డిజైన్ వెంటనే మార్చాలని ఏకవాక్య తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఆ గ్రామసభల తీర్మానాన్ని అధికారులు, ప్రభుత్వం ఎంతవరకు పరిగణనలో తీసుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. రైతుల సాగునీటి అవసరం కోసమని 2007లో తయారుచేసిన ప్రాజెక్టు రూపకల్పనకు, ఇప్పటి భూమి స్థితికి చాలా వ్యత్యాసం ఉందని చెప్పారు. అంత పెద్దసైజు కాలువ అవసరం లేదన్నారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రైతులతో సమావేశమై, శృంగవరపుకోట మండలం కొత్తూరు రెవెన్యూ నుంచి గుర్ల వరకు ఎటువంటి భూసేకరణా చేపట్టవద్దని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారని గుర్తుచేశారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కూడా నియోజకవర్గంలోని రైతులకు అండగా నిలవాలని కోరారు. నిజంగా రైతులకు సాగునీరు ఇవ్వాలని భావిస్తే, రైవాడ, తాటిపూడి నీరు రైతులకు ఇచ్చి, పోలవరం కాలువ నీరు విశాఖ వాసులకు, పారిశ్రామిక అవసరాలకు కేటాయించాలని డిమాండ్‌చేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా వేలాది మంది రైతులను నిరాశ్రయులు కాకుండా చేయొచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం రైతులు నిరసన చేపట్టి, కాలువ డిజైన్ మార్చాలని నినాదాలు చేశారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ జిల్లా నాయకులు రౌతు బాబూరావు, మజ్జి శ్రీను, ఎం.అర్జునరావు, వేపాడ సర్పంచ్ మెలిపాక రమణ, దబ్బిరాజుపేట మాజీ సర్పంచ్ ఏరువాక అప్పలనాయుడు, సిరికి నాయుడుబాబు, బూసర్ల నారాయణమూర్తి, పాత్రుడు, అదపరెడ్డి అప్పారావు, నిరుద్యోగి కృష్ణ, అదపరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ సర్వే అడ్డగింత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బైపాస్ సర్వేను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, రైతులు

పెందుర్తి నుంచి బొడ్డవర వరకు 516బి జాతీయ రహదారికి బైపాస్ నిర్మాణం కోసం చేపడుతున్న సర్వేను సిపిఎం ఆధ్వర్యంలో రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ రైతులకు చెప్పకుండా బలవంతంగా భూ సర్వే చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ రహదారి-516బి కోసం భూసేకరణపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే తహశీల్దార్‌కి ఫోన్ చేసి ప్రస్తుతం విశాఖ-అరకు రోడ్డు ఆక్రమణలు తొలగించి 516బి జాతీయరహదారిగా కొనసాగించడానికి సమస్య ఏమిటని ప్రశ్నించారని గుర్తుచేశారు. ఆ విషయంపై పరిశీలన చేసి చెబుతామని కలెక్టర్ చెప్పారని వెల్లడించారు. మరి దానిపై ఏం పరిశీలన చేశారోనన్న విషయాన్ని రైతులకు గాని, రైతు సంఘం నాయకులకు గాని సమాచారం ఇవ్వకుండా బలవంతపు భూ సర్వే చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి, తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.ముత్యాల నాయుడు, ఎన్.సోమినాయుడు, కె సూర్జశీ, వై.రాంబాబు, వై.దేముడు, పి.రమణ, వై.ఆనంద్, వై ఈశ్వరరావు, కె అప్పలనాయుడు, బి.కృష్ణ , కె.నాగమణి, సిహెచ్.శంకరరావు పాల్గొన్నారు.

'ఉపాధి' ద్వారా మౌలిక వసతులు

- ఈ ఏడాది నిధులను శతశాతం వినియోగిస్తాం
- డ్వామా కార్యక్రమాల అమలుపై సమీక్షలో మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ ఉపాధిహామీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ పథకం కింద వేతనదారులకు పని కల్పించడం ద్వారా వలసలను నివారించడమే కాకుండా, కన్వర్జెన్సీ నిధులతో సిసిరోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు, రైతులకు ఉపయోగపడేలా చెరువుల అభివృద్ధి, ఫారమ్ పాండ్స్, గోకులాల నిర్మాణం, నర్సరీల పెంపకం తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధిహామీ పథకాన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకొని ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష చేశారు.

ఉపాధి వేతనదారులకు పని కల్పన, వంద రోజుల పనిదినాలు, సగటు వేతనం పెంపు, ఫారమ్‌పాండ్స్, ఇంకుడు గుంతలు, గోకులాలు, ఉద్యాన సాగు, పట్టుసాగు, పశుగ్రాసం పెంపకం, నర్సరీలు, కన్వర్జెన్సీ పనులు తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు, జీవన ప్రమాణాలను పెంచేందుకు ఈ పథకం గొప్ప అవకాశమని, దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్వామా, డిఆర్‌డిఎ శాఖలు రెండూ అత్యంత ప్రాధాన్యమైనవని, అభివృద్ధిలో వీటి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ ఏడాది కన్వర్జెన్సీ నిధులను శతశాతం వినియోగించుకొనేందుకు జిల్లా స్థాయిలోనే కాకుండా, మండలస్థాయిలో కూడా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ పనులను జూన్ నుంచి మొదలు పెట్టాలని ఆదేశించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగ్రాసం పెంపు విస్తీర్ణం పెంచాలని, వ్యక్తికి గరిష్టంగా 50సెంట్ల నిబంధనను సవరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలానికి ఐదు బయో గ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఉపాధి పథకం కింద కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. పశువులు ఉన్నవారికే గోశాలలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఉన్నతి పథకం కింద ఉపాధిహామీ వేతన దారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించాలని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది శతశాతం వినియోగించుకోవడం ద్వారా మూడోసారి అవార్డును సాధించేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్, తోటపల్లి ఎస్ఇ స్వర్ణకుమార్, పశుసంవర్ధకశాఖ డిడి డాక్టర్ ఎన్.రామారావు, డిఎఫ్ఓ కొండలరావు, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ, డ్వామా ఎపిడిలు, ఎపిఒలు, ఇసిలు, పిఆర్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా

వైద్యులు, మెడికల్ రిప్‌ల మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మానవహారం చేపడుతున్న వైద్యులు, మెడికల్ రిప్‌లు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని ఐఎంఎ, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యాన కోట జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు జె సి నాయుడు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్, ఐఎపి రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వరావు, బి.గౌరీ శంకరరావు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యుఎస్ రవికుమార్ మాట్లాడారు. మాతృ సంబంధిత నవజాత శిశువుల ఆరోగ్యంపై విస్తృత ప్రచారం చేయాలని డబ్ల్యుహెచ్ఒ పిలుపునిచ్చిందన్నారు. ఆరోగ్యకరమైన గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్యం, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ప్రతీ ఏటా 3 లక్షల మంది మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి శిశువుకు జన్మనిచ్చే సమయంలోపల చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మరణాలన్నింటినీ ఆపవచ్చునని, మహిళలకు శారీరక, మానసిక ఆరోగ్యం కీలకమని తెలిపారు. మహిళల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత ఎక్కువగా వుందన్నారు. గిరిజన ప్రాంతం, గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల డెలివరీలకు ఇప్పటికి డోలీలపై గర్భిణులను తీసుకెళ్లే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంతమంది గైనకాలజిస్టులు లేకపోవడం, మౌలిక వసతుల కొరత, వ్యాక్సిన్ సదుపాయం మెరుగుపడకపోవడం, బాల్యవివాహాలు వంటి వాటిని అధిగమించడం ద్వారా మరణాలను ఆపవచ్చునని తెలిపారు. ఆరోగ్యంపై బడ్జెట్లో 5 శాతానికి పైగా నిధులు కేటాయిస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుం దన్నారు. ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు తారకేశ్వరావు, వెంకట్, సునీల్, ఎం.శంకరరావు, మృత్యుంజయరావు, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యభగవాన్, సుధీర్, డిఎల్ ఎం మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు బి.సుధారాణి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, మెడికల్ రిప్స్ పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వి బి సుబ్రమణ్యం, పిఒ ఎన్‌సిడివై మణి, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

---

32 వేల మంది లబ్ధిదారులు గుర్తింపు

ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వచ్చే మార్చినాటికి గహనిర్మాణ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హౌసింగ్ ఎఇలను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. పిఎంఎవై 2.0 కొత్త గృహాల కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 32వేల మంది లబ్ధిదారులను గుర్తించారని, వారికి ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో గృహనిర్మాణ ప్రక్రియ, కొత్త ఇళ్ల మంజూరుపై కలెక్టరేట్లో సోమవారం సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, పిఎంఎవై (అర్బన్) 1.0 కింద మంజూరైన ఇళ్లలో 11,648 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోయిందని, వీటిలో ఇప్పటివరకు 3,921 ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన 7727 ఇళ్లను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవలే అదనపు సాయం కింద ఎస్‌సి, బిసిలకు రూ.50వేలు, ఎస్‌టిలుకు రూ.75వేలు, ఆదివాసీ గిరిజన తెగలకు రూ.లక్ష మంజూరు చేసిందని, ఈ సాయాన్ని లబ్ధిదారులు అందరికీ వర్తింపజేయాలని చెప్పారు. ఇంకా మున్సిపాల్టీల్లో సుమారు 1500 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరికి ఈ అదనపు సాయాన్ని అందించేందుకు అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. పిఎంఎవై 2.0కింద మంజూరు చేయనున్న ఇళ్ల లబ్ధిదారులు సుమారు 32వేల మందిలో ఇప్పటివరకు సుమారు 2,250 మందికి పొజిషన్ సర్టిఫికేట్లను మంజూరు చేశారని, మిగిలిన వారికి కూడా మంజూరుచేసి, వీలైనంత త్వరగా వాటిని ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి పిడి జి.మురళీమోహన్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జిఆర్ఇఎఫ్ జవాను మృతి

ప్రజాశక్తి-కొత్తవలస

బిఆర్ఓలోని పారా మిలిటరీకి చెందిన జిఆర్ఇఎఫ్ (జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్) జవాను రాయపుర్ణెడ్డి దేముడునాయుడు అనారోగ్యంతో మరణించారు. పశ్చిమ బెంగాల్లో సుదీర్ఘకాలంగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం అనారోగ్యంతో ఆయన మరణించగా, స్వస్థలం కొత్తవలస మండలంలోని నరపాంలో అధికార లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు అధికసంఖ్యలో జనం హాజరయ్యారు. దేముడునాయుడు మృతితో నరపాంలో విషాదఛాయలు అలముకున్నాయి. దేముడునాయుడుకు భార్య నాగమణి, ఇద్దరు కుమారులున్నారు.

సత్య కళాశాలలో నేడు క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ, పిజి కళాశాలలో మంగళవారం హెటిరో ల్యాబ్ లిమిటెడ్ పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ విభాగంలో బిఎస్సి అన్ని గ్రూపుల వారు, బికాం, బిఎ పాసైన, ప్రస్తుత డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఐదో సెమిస్టర్ వరకు బ్యాక్‌లాగ్స్ లేని అభ్యర్థులు 18 నుంచి 26ఏళ్ల వయసు గల వారు మాత్రమే అర్హులని తెలిపారు. క్యూసి, క్యూ ఎ విభాగంలో ఎంఎస్సి ఆర్గానిక్ కెమిస్ట్రీ పాసైన, ప్రస్తుత ద్వితీయ సంవత్సరం చదువుతున్న మూడవ సెమిస్టర్ వరకు బ్యాక్ లాగ్స్ లేని 26 సంవత్సరాల వయసు లోపున్న అభ్యాయులు మాత్రమే అర్హులని తెలిపారు. ఫిట్టర్ మరియు ఎలక్ట్రికల్ విభాగంలో ఐటిఐ 2021నుంచి 2024 వరకు పాసైన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు 8-4-20025 ఉదయం 9 గంటలకు సత్య డిగ్రీ - పీజీ కళాశాల, తోటపాలెం, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర, విజయనగరం అడ్రస్‌కు బయోడేటా, సర్టిఫికెట్ కాపీలు, పాస్‌పోర్టుసైజ్ ఫోటో ను పట్టుకొని ఇంటర్వ్యూకు రావాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబరులు 70132 93316, 90327 72661, 99630 69332, 70137 87725 ను సంప్రదించాలని తెలిపారు.

గాయత్రి డిగ్రీ కాలేజీలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెం గాయత్రి డిగ్రీ కాలేజీలో ఈనెల 9న బుధవారం అరబిందో న్యూలాండ్, (గ్రాన్యూల్) తదితర ఫార్మా కంపెనీల ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డి.గోరీశ్వర, కరస్పాండెంట్ నవీన్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. రెండు లక్షల నుండి మూడు లక్షల వరకు ప్యాకేజీ ఉంటుందని, ఇంటర్, డిగ్రీ, పీజీలో కెమిస్ట్రీ చదివిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని వారు కోరారు. అభ్యర్థులు ఉదయం 9గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

తుమికాపల్లి వద్ద ఉన్న వినాయకనగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు సోమవారం 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పెంట కాపాలు మాస్టారు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో ఈ సరుకులు అందజేసినట్టు హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పెంట రమేష్, పెంట రవి, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ రవి, రైల్వే విశ్రాంత ఉద్యోగి రమణ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

ప్రజాశక్తి-కొత్తవలస

మానసిక ఒత్తిడికి గురికాకుండా, పౌష్టికాహారం, యోగా, వ్యాయామం, మంచినిద్రతో ఆరోగ్యంగా ఉంటామని చియ్యపుపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పిహెచ్‌సి సిబ్బంది, గురుకుల విద్యార్థులు చియ్యపుపేటలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు-2025.. అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ ఎస్.జగదాంబ, హెచ్.వి.పద్మావతి, ఫార్మసిస్ట్ అశాజ్యోతి, యుడిసి సురేష్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, స్టాఫ్ నర్స్ రోజా, దీప, ఎల్.టి.సంతోష్ పాల్గొన్నారు.

కుస్తీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో కొండవెలగాడ జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల పీడీ పతివాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6 వరకు రామచంద్రపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల బాలికల జూనియర్ కుస్తీ పోటీల్లో 44కిలోల విభాగంలో ఎల్.చైతన్య బంగారుపతకం, 48 కిలోల విభాగంలో ఎం.రఘువీర్ రజిత పతకం, 67కిలోల విభాగంలో ఎస్.రామాంజనేయులు రజిత పతకం సాధించారని తెలిపారు. వీరిని పాఠశాల హెచ్ ఎం.వి.జ్ఞానశంకర్, సిబ్బంది, గ్రామపెద్దలు, యువత అభినందించారు.

ఎంఎంసి భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ కింద భూములు ఆక్రమణలకు గురయ్యాయని మాజీ ఎంఎంసి చైర్మన్, మండల టిడిపి అధ్యక్షులు కరోతు సత్యనారాయణ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డెంకాడ మండలం మోదవలస వద్దున్న మార్కెట్ కమిటీ కి చెందిన భూముల్లో షాపులు నిర్మించి, ఆక్రమించి చుట్టు ప్రహరీ గోడ నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసిపి నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

పారా అథ్లెటిక్స్ విజేతకు మంత్రి సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇండియన్ బాడీ బిల్డింగ్, ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5,6 తేదీలలో ఒరిస్సాలోని సంబల్ పూర్ లో జరిగిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో స్టార్ విభాగంలో పారా బిల్డర్ ఈదుబిల్లి సూర్యనారాయణ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సూర్యనారాయణను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెరకముడిదాం మండలం వంగర గ్రామానికి చెందిన సూర్యనారాయణ జాతీయ స్థాయిలో రాణించి మెడల్ సాధించడం జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్ లో మరిన్ని పతకాలు సాధించి క్రీడల్లో జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. పారా క్రీడలకు సంబంధించిన వివరాలను పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ మంత్రికి వివరించారు. పారా క్రీడాకారులకు సహకారం అందేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

క్రీడాకారుడిని సన్మానిస్తున్న మంత్రి కొండపల్లి

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేసి, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయనగరం మండల ఆర్ఐ వివి రాజుకు ఎపి రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో వినతి అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్ మోహన్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ మాదిరి ఇక్కడ కూడా పే స్కేల్ అమలు చేస్తుందని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తిస్తారని ఆశించామని, కానీ గడిచిన తొమ్మిది నెలల్లో కనీసం తమ సమస్యలపై చర్చించే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకనే రాష్ట్రవ్యాప్తంగా విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు సిద్ధం కాబోతున్నామని, అందులో భాగంగా వినతి పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకుల ప్రసాద్ , పైడ్రాజు, జయరాజు, రాములప్పుడు, వీరస్వామి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యపై వినతి

రామభద్రపురం : విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు ఆధ్వర్యంలో విఆర్ఎలు డిప్యూటీ తహశీల్దార్ గిరిధర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ విఆర్ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, డిఎను వేతనంతో కలిపి అందించాలని డిమాండ్ చేశారు. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, నైట్ డ్యూటీలు రద్దు చేసి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న విఆర్ఎ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల నాయకులు లక్ష్మి, మారయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో డిటి గౌరిశంకర్రావుకు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు రాజారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం ఆధ్వర్యాన తహశీల్దార్ సుధాకర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు ముని, విఆర్ఎలు పాల్గొన్నారు.

చీపురుపల్లి : తమకు పే స్కేలు అమలు చేయాలని విఆర్ఎలు చీపురుపల్లి తహశీల్దారు నమ్మి రాజారావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో కింద స్థాయి ఉద్యోగులుగా ఎన్నో ఏళ్లు నుండి పని చేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ఖర్చులు దృష్ట్యా తమకు తగిన వేతనాన్ని ఇవ్వడం లేదని అన్నారు. విఆర్ఎల పే స్కేలు అమలు చేసి రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. డిఎను జీతంతో కలిపి ఇవ్వాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. అర్హులైన విఆర్ఎ లందరికీ ప్రమోషన్ కల్పించాలని, ఖాళీగా ఉన్న విఆర్ఎ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ అనురాధ, దాడి సూర్యనారాయణ, బి మహలక్ష్మి, సిహెచ్ నాగరాజు, బి ఆదినారాయణ, ఉప్పాడ పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం, రామభద్రపురం మండలాల్లో రెవెన్యూ అధికారులకు వినతులు ఇస్తున్న విఆర్ఎ సంఘం నాయకులు, విఆర్ఎలు

రికార్డులు పరిశీలిస్తున్న జెడి చిన్నయిదేవి

1428 అంగన్వాడీ పోస్టులు భర్తీ

ప్రజాశక్తి - భోగాపురం

విశాఖ రీజనల్ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో అంగన్వాడీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామని స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయానికి సోమవారం ఆమె వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 1428 పోస్టులను భర్తీ చేయనున్నామని తెలిపారు. ఇందులో అంగన్వాడి కార్యకర్తలు, మినీ అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్ పోస్టులు ఉన్నాయన్నారు. ఆయా కలెక్టర్ల వద్ద దస్త్రం ఆమోదం పొందిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని తెలిపారు. మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. అనంతరం కార్యాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. జిల్లా ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం, ఎసిడిపిఒ సత్యవతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పట్టుకున్నారు..వదిలేశారు..

- ముడుపులు అందడంతోనే వదిలేసారంటన్న స్థానికులు
- పోలీస్ స్టేషన్‌కు ఏ వాహనాలనూ అప్పజెప్పలేదన్న ఎస్ఐ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని లింగాలవలస కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాల్లో కొంతమంది అధికారులకు ముడుపులు అందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎందుకంటే గ్రావెల్ తవ్వకాలు జరిగేటప్పుడు కొన్ని శాఖల సిబ్బంది వచ్చినప్పటికీ చూసి చూడనట్లు జెసిబితో పాటు ట్రాక్టర్లను వదిలేసారు. తమకు రెవెన్యూ అధికారులు ఎటువంటి వాహనాలూ అప్పజెప్పలేదని మరో పక్క ఎస్ఐ చెబుతున్నారు. దీంతో సిబ్బందికి ముడుపులు అందడంతోనే వదిలేసారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఆదివారం అధికారులు సెలవులో ఉంటారనే ఉద్దేశంతో లింగాలవలస కొండపైన కొంతమంది వ్యక్తులు గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టారు. ఈ సమాచారాన్ని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఇచ్చినప్పటికీ వారు సకాలంలో స్పందించలేదు. దీంతో విజిలెన్స్‌తో పాటు పోలీస్ హైవే మొబైల్ సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు స్థానికలు చెబుతున్నారు. పోలీస్ హైవే మొబైల్ వాహనంతోపాటు విజిలెన్స్ సిబ్బంది కొండ వద్దకు వెళ్లడంతో వెంటనే తవ్వకాలను నిలుపుదల చేశారు. కానీ సంఘటన స్థలంలో పట్టుబడిన జెసిబి, రెండు ట్రాక్టర్లను వదిలేశారు. అక్రమ తవ్వకాలపై పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే వీరికి ముడుపులు అందడంతోనే వదిలేసారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టుబడిన వాహనాలను వదిలేసారంటే తెర వెనక ఏమి జరిగిందో ఇట్టే అర్థమైందని పలువురు అంటున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వేస్తున్న కొండ ఇదే

మాకు ఎటువంటి వాహనాలూ అప్పజెప్పలేదు

లింగాలవలస కొండపై గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఫిర్యాదు చేస్తామని తహశీల్దారు నుంచి సమాచారం వచ్చింది. కానీ ఎటువంటి ఫిర్యాదు అందలేదు. జెసిబి, ట్రాక్టర్లను కూడా ఎవరు మాకు అప్పజెప్పలేదు. ఫిర్యాదు లేనందున మేము కూడా స్వాధీనం చేసుకోలేదు.

పాపారావు, ఎస్ఐ, భోగాపురం

అల్లాడపాలేన్ని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి- పూసపాటిరేగ

ఈ నెల 6న ప్రజాశక్తి పత్రికలో వచ్చిన 'ఫార్మా విషపు కోరల్లో అల్లాడపాలెం అనే వార్తకు స్పందించిన సిపిఎం పార్టీ బృందం సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ మాట్లాడుతూ కందివలస గెడ్డ ఒడ్డున, అల్లాడ పాలెం గ్రామానికి సమీపంలో ఉన్న ఫార్మా పరిశ్రమలు వెదజల్లుతున్న వ్యర్థ పదార్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై పంట పొలాలు కలుషితమైపోతున్నాయన్నారు. పంటలు పండించుకోవడానికి భూములు పనికిరాకుండా పోవడంతో పాటు భూగర్భంలో ఉన్న నీటిని ప్రజలు, పశువులు తాగడానికీ కూడా పనికిరాకుండా తయారయ్యాయన్నారు. ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు అనేక జబ్బుల బారిన పడుతున్నారని పశువులు కూడా చనిపోతున్నాయని ప్రజల ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఆ గ్రామ ప్రజానీకానికి సురక్షిత మంచినీరు అందించే లక్ష్యంతో అరబిందో పరిశ్రమ యాజమాన్యం ఒక వాటర్ ట్యాంకును నిర్మించినప్పటికీ అది నిరుపయోగంగా పడి ఉంది తప్ప దానివల్ల ప్రజలకు ఏ రకమైన ఉపయోగమూల లేదన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని అల్లాడపాలెం గ్రామం వల్లకాడు కాకముందే ప్రజానీకానికి అండగా నిలబడి సమస్యలను పరిష్కారం చేయాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నా మన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజల పక్షాన సిపిఎం పార్టీ పోరాడుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం మండల కార్యదర్శి బి.సూర్యనారాయణ, పార్టీ సభ్యులు జి.గురునాయుడు రైతులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మహిళా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామభద్రపురం

మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. రామభద్రపురంలోని శ్రీరాంనగర్ కాలనీలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి, తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రత్నం, ఇఒ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.

పాడి అభివృద్ధిపై దృష్టిసారించాలి

పాడి అభివృద్ధిపై ప్రతిఒక్కరూ దృష్టిసారించాలని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న పశువుల తొట్టి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పశువుల ఆస్పత్రి పున:నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి హిరణ్య తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయ సమీపంలో కోనేటి సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

సంపద సృష్టి కేంద్రం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలిలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం లేకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్తాచెదారాన్ని గ్రీన్ అంబాసిడర్లు ఊరు శివారులో డంపింగ్ చేస్తున్నారు. దీంతో పాటు నియోజకవర్గంలో కొన్ని పంచాయతీల్లో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాలు లేకపోవటం పై ప్రజాశక్తిలో ఆదివారం 'స్వచ్ఛ గ్రామాల ఆశయం నెరవేరేనా' అనే కథనం వెలువడింది. దీనికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆయా మండలాల ఇఒపిఆర్‌డిలను ప్రశ్నించారు. తక్షణమే రేగిడి ఇఒపిఆర్‌డి ఏవి. సత్యనారాయణ స్పందించి ముందుగా సంకిలి సర్పంచ్ బుడుమూరు పట్టాభి, అప్పాపురం పంచాయతీ కార్యదర్శి రామ్‌కుమార్ సోమవారం జెసిబిని ఏర్పాటు చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి గ్రామ పంచాయతీలో సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటునకు తహశీల్దార్లను కలిసి స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి గ్రామ పంచాయతీలో కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎల్‌పి ఆదేశించారు.

వాయు కాలుష్యంతోనే అధిక మరణాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వాయు కాలుష్యం పెరిగిపోవడం వల్ల సాధారణ మరణాల కంటే వాయు కాలుష్యం వల్ల ఎనిమిది రెట్లు ఎక్కువగా మరణాలు సంభవిస్తొన్నాయని మిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భానుప్రకాష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాయు కాలుష్యం ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయమై పిపిటి ద్వారా వివరించారు. డాక్టర్ జి.రమేష్ ఆహారం-ఆరోగ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ ఎం.పల్లవి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బొబ్బిలి మండలం పరిధిలో ఉన్న గోపాలరాయుడుపేట, కాశిందొర వలస, బొడ్డవలస పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, కార్యవర్గ సభ్యులు పి.శ్రీనునాయుడు మాట్లాడుతూ గోపాల రాయుడుపేట పంచాయతీ బట్టి వలసలో గత 15ఏళ్లగా స్కూల్ ఉన్నప్పటికీ దానికి సొంత బిల్డింగ్ లేదని, దీంతో విద్యార్థులు గోపాలరాయుడుపేట వరకు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అక్కినవలస గ్రామానికి అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలన్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర అంబేద్కర్‌కు వినతినిచ్చారు.

పారిశుధ్యం మరింత మెరుగుపడాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కలకు శస్త్ర చికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు శతశాతం జరిపించాల్సిందేనని చెప్పారు. సచివాలయాల పరిధిలో సంచరిస్తున్న కుక్కల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీ లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రభుత్వ స్థలాలను, రహదారులను ఆక్రమించి ఎటువంటి అనధికార నిర్మాణాలు, వ్యాపారాలు చేయరాదని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, అనధికార నిర్మాణాలను గుర్తించి తక్షణమే అటువంటి వాటిని తొలగించి వేయాలని ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి,టౌన్ సర్వేయర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పన్ను రాయితీతో క్యూ కడుతున్న నగర వాసులు

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను చెల్లింపులకు ఐదు శాతం రాయితీని ప్రకటించడంతో పన్ను చెల్లింపుదారులలో అనూహ్య స్పందన కనిపిస్తోంది. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 2 ప్రత్యేక కౌంటర్లు వద్ద భారీగా ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ పన్నులను చెల్లిస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను మొత్తాన్ని ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే ప్రభుత్వం ఐదు శాతం రాయితీని ప్రకటించిందన్నారు. దీంతో అధిక సంఖ్యలో చెల్లింపుదారులు కార్యాలయానికి వచ్చి పన్నులను చెల్లిస్తున్నారన్నారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని వెల్లడించారు.

గొడ్డుపాలెంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- డెంకాడ

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలతో మండలంలోని వెదుల్లవలస పంచాయతీ పరిధిలోని గొడ్డుపాలెం గ్రామంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం గ్రీవెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తాగునీటి కొరత, రహదారి పరిస్థితులు, పింఛన్లు, రేషన్ కార్డులు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, డ్రైనేజ్ సమస్యలు వంటి అనేక అంశాలపై వినతులు అందజేశారు. మండల స్థాయి టిడిపి, జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు హాజరై ప్రజల వినతులను స్వీకరించారు. అనంతరం గ్రామంలో హ్యాండ్ బోరును ప్రారంభించారు. ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, కోఆర్డినేటర్ పైలా శంకర్, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, జనసేన నాయకులు పాలు శ్రీను పాల్గొన్నారు.

'ఆగ్రోస్' సామగ్రి కొనుగోలు చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ట్రాక్టర్లు, ట్రైర్లు, పార్కు నిర్వహణకు అవసరమయ్యే సామగ్రిని ఆగ్రోస్ సంస్థ నుంచి కొనుగోలు చేయాలని ఎపి ఆగ్రోస్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ బాబు.. మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులును కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన్ను చంద్రశేఖర్‌తోపాటు సేల్స్ ఎగ్జిక్యూటివ్ చంద్రశేఖర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ త్రినాథ కలిశారు. ఆగ్రోస్ సంస్థ నుంచి కొనుగోలు చేస్తే ఆడిట్ అవసరం లేదని వివరించారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

ఎపి ఆగ్రోస్ ద్వారా రైతులకు సబ్సిడీపై యంత్రాలు సరఫరా చేస్తామని జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ బాబు చెప్పారు. ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు.. రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పట్టపగలే చోరీ

15 తులాల బంగారం, రూ. 35 వేలు నగదు అపహరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పోతనపల్లిలో పట్టపగలు చోరీ జరిగింది. సిఐ నారాయణమూర్తి కథనం ప్రకారం... పోతనపల్లిలో కిలపర్తి కొండమ్మ తన ఇద్దరు కుమారులు, కోడళ్లతో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం కొండమ్మ ఉపాధి పనికి, ఆమె కోడళ్లు గ్రామంలోకి వెళ్లారు. ఆమె పెద్దకుమారుడు ఇంటికి తాళం వేసి గేటుపక్కన ఉన్న కుండీ కింద తాళం చెవిపెట్టి బయటకు వెళ్లాడు. ఉపాధి పనికి వెళ్లిన కొండమ్మ 11.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి, కాసేపటికి బెడ్‌రూమ్ వైపు వెళ్లగా బీరువాలు తెరిచి బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇద్దరి కోడళ్లకు, మనుమలకు సంబంధించిన బంగారు వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ నారాయణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరించారు. పట్టపగలు ఈ దొంగతనం జరగడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. కుటుంబసభ్యులు ఇంటితాళం పెట్టడం, ఇంట్లో ఎవరూ లేని విషయం గురించి తెలిసిన వారే ఈ పనిచేసి ఉంటారనే అనుమానాలు బలపడుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ప్రాంతంలో సిసి కెమెరాల పుటేజీలు సేకరిస్తున్నారు.

8 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

బుచ్చన్నపేటలో 8 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నట్లు సిఎస్ డిటి ఆర్. శంకరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బొప్పడాం పంచాయతీ బుచ్చన్నపేట జంక్షన్‌లో కుర్మాన కమల అనే మహిళా ఇంట్లో 19 సంచులతో 8 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్ఐ బి.రామారావు, సిబ్బంది అక్రమంగా ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

IN THE HONOURABLE COURT OF THE 5th ADDITIONAL DISTRICT JUDGE CUM MAHILA COURT JUDGE AT VIZIANAGARAM.
O.S.No 45/2024.

Between:
Smt Kandhi Marraju, ...Plaintiff.
And:
1. Smt Althi Krishnaveni,
2. Sri Althi Srinu,
3. Miss Althi Bhargavi,
4. Miss Althi Yasaswi,
5. Sri Deepala Johnson Daniel,
6. Sri Vemala Ravi Kumar,
7. Sri Sirivuri Appalaraju,
8. Revenue Divisional Officer, Vizianagaram.
9. The state represented by District Collector.
.......Defendants.

THE DEFENDANTS No 6 AND 7

6) Sri Vemala Ravi Kumar S/o Sriramulu, Hindu, aged about 41 Years, Resident of D/No 1-104, Kalighat Colony, Kanapaka, Vizianagaram Town, Vizianagaram Municipal Corporation.

7) Sri Sirivuri Appalaraju S/o Late Neeladri Raju, Hindu, aged about 65 Years, Resident of Devi Colony, Ayyannapeta, Vizianagaram.

Please take notice that the above named Plaintiff instituted the above matter against you. Further, along with the said suit, the plaintiff also filed I.A.No 252/2024 for temporary injunction against you. The said suit and the said interim application stands posted to **25th day of April 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at **10.30 A.M.,** failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.